వేసవిలో విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట!

● రూ.4.96కోట్లతో ముందస్తు ప్రణాళికలు

సైదాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో అధిక విద్యుత్ లోడ్‌ను తట్టుకునేందుకు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందు కోసం రూ. 4.96కోట్లతో ముందస్తు పనులు ప్రారంభించారు. గత వేసవిలో సాధారణ రోజులకంటే ఇప్పుడు దాదాపు రెట్టింపు విద్యుత్ వినియోగం అవుతోంది. దీంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు అధిగమించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మార్చి నుంచి ఎండలు తీవ్రం కానుండటంతో అధిక విద్యుత్ లోడ్‌ను తట్టుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను తగ్గించేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో 11కేవీ, ఎల్‌టీ లైన్లు మార్చడం, విద్యుత్ స్తంభాలను తొలగించడం, విద్యుత్ తీగల వద్ద అంతరాయం కలిగించే చెట్లను తొలగించే పనులు చేపడుతున్నారు. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలో ఆస్మాన్‌ఘడ్, చంచల్‌గూడ, సైదాబాద్, చాదర్‌ఘాట్, సలీంనగర్, సంతోష్‌నగర్, డబీర్‌పురా, యాఖత్‌పురా, భవానీనగర్, మాదన్నపేట 10సెక్షన్ల పరిధిలో 11 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 1,90,040 గృహ, 33,212 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్‌లో 61,982, సంతోష్‌నగర్‌లో 67,166, చంచల్‌గూడ సబ్ డివిజన్‌లో 60,892 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.


చంచల్‌గూడ సబ్‌స్టేషన్

అధికలోడ్ నియంత్రణకు..

వేసవిలో అధిక లోడ్ నియంత్రణ కోసం డివిజన్ పరిధిలో అదనంగా కొత్త డీటీఆర్‌లకు డీటీఆర్ పెంపుదలకు, ఎల్‌టీ ఫీడర్లకు, 11కేవీ లైన్లకు ఫీడర్లు అదనంగా ఏర్పాటుకు రూ.2.43 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్‌కు రూ.38లక్షలు, సంతోష్‌నగర్ సబ్ డివిజన్‌కు రూ.41లక్షలు చంచల్‌గూడ సబ్ డివిజన్‌కు రూ.41లక్షలు వెచ్చిస్తున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా

ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గతేడాది విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకున్నాం. వేసవితో పాటు వర్షాకాలంలోనూ సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నాం. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తాం.

\- హన్మంతరెడ్డి, డీఈ, ఆస్మాన్‌ఘడ్ డివిజన్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 75మంది లబ్ధిదారులకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం అందజేశారు. అంబర్‌పేట మండలంలో 34 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు, 14మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను, సైదాబాద్ మండలంలో మరో 27మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఆడ పిల్ల వివాహానికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న వరం ఈ పథకం అని ఎమ్మెల్యే అన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి: కార్పొరేటర్


శ్మశానవాటికలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నందనవనంలోని శ్మశానవాటికలో జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఏఈ హేమునాయక్‌తో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని కోరారు. శ్మశానవాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిరిహిల్స్ కాలనీలో మార్నింగ్ వాక్ చేస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

మార్నింగ్ వాక్‌తో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం

● కార్పొరేటర్ నరసింహారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి శుక్రవారం డివిజన్‌లోని సిరిహిల్స్ కాలనీలో ప్రజలతో కలిసి మార్నింగ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మార్నింగ్ వాక్ వల్ల క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, మురళీ, సర్వేశ్వర్, చారి, శంకర్‌గౌడ్, బాల్‌రెడ్డి, చంద్రం, ఎల్లారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, కోటయ్య, రమేష్‌చారి, శ్రీధర్‌గౌడ్, సాయిరాం, యాదగిరియాదవ్, రోహిత్‌రెడ్డి, చింటూ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ డీసీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


డీసీ జాకియా సుల్తానాకు అభినందనలు తెలుపుతున్న గ్యారగోని ప్రవీణ్‌గౌడ్

చంపాపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాకియా సుల్తానాను శుక్రవారం కాంగ్రెస్ చంపాపేట డివిజన్ సీనియర్ నాయకుడు గ్యారగోని ప్రవీణ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యలను ఆయన డీసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు ఉమేష్‌గౌడ్, రాంబాబు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీ యాదయ్యకు శుభాకాంక్షలు


డీసీ యాదయ్యను సన్మానిస్తున్న ఉమేష్‌గౌడ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ తిప్పర్తి యాదయ్యను కాంగ్రెస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఉమేష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమేష్‌గౌడ్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీ.రాంబాబుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, సహదేవ్‌గౌడ్, హరిశంకర్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ అభినందనలు


ఇన్‌స్పెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్‌పర్సన్ స్వప్నాచిరంజీవి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ, డీఐ రుద్వీర్‌కుమార్‌ను శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర సురేష్, మోతే రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న సందీప్

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులైన సైదయ్యను శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి మెరుగు సందీప్‌యాదవ్ కలిసి సన్మానించారు. ప్రతీక్‌యాదవ్, సోను, రాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

హయత్‌నగర్ సీఐకి..


సీఐని సన్మానిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సీఐగా బదిలీపై వచ్చిన జి. రామకృష్ణను శుక్రవారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి పూల బోకేను అందించారు. కార్పొరేటర్ వెంట బండారి భాస్కర్, నరసింహారెడ్డి, పారంద మహేష్‌తో పాటు పలువురు ఉన్నారు.


తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నూతనంగా నియమితులైన అజ్మతుల్లా ఖాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాములు తదితరులు

\- సైదాబాద్, ఆంధ్రజ్యోతి

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి

● ఎస్ఈ కరుణాకర్‌బాబు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ కరుణాకర్‌బాబు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడానికి అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ ఎస్ఈ కరుణాకర్‌బాబు ఆదేశించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకునే విషయమై ఎల్‌బీనగర్ సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సరైన ప్రణాళికలు రూపొందించుకుని 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఏఈలపై ఉందన్నారు. పీక్ లోడ్ అవర్స్‌లో (సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు) అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా తమ ఎఫ్‌ఓసీ పరిధిలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలని ఆయన సూచించారు. పీక్ లోడ్ అవర్స్‌లో ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లపైన టంగ్‌టెస్టర్ రీడింగ్ తీసుకుని నివేదికలు సమర్పించాలని ఏఈలను ఆదేశించారు. సమావేశంలో సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ, ఏడీఈ ప్రభాకర్, ఏఈలు వేణుగోపాలాచార్యులు, ఉదయ్, నవీద్‌అలీలతో పాటు మూడు సెక్షన్ల పరిధిలోని ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలకు స్థలం కేటాయించండి

● ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన ఇంజాపూర్ గ్రామస్థులు, కౌన్సిలర్లు


ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలకు రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఇంజాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా ఇంజాపూర్ పాఠశాలకు రూ.54లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. పథకం అమలు జరగాలంటే కనీసం ప్రభుత్వ పాఠశాల రెండు ఎకరాలలో ఉండాలనే నిబంధనలు ఉన్నాయని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. స్థలం కేటాయించినట్లయితే వరుసగా నాలుగు సంవత్సరాల పాటు రూ.50లక్షల చొప్పున పాఠశాలకు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలకు కేవలం 150 గజాలు మాత్రమే ఉందన్నారు. పీఎం పథకం ఇంజాపూర్ పాఠశాలకు వచ్చే విధంగా గ్రామంలోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పాఠశాలకు కేటాయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఇంజాపూర్, తొర్రూర్, సంఘీనగర్ వరకు గతంలో ఉన్న ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. తొర్రూర్ ఇంజాపూర్ మధ్యలో అనేక కాలనీలు వెలిశాయని తెలిపారు. బస్సు సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు గ్రామాలకు రోడ్డు కూడా చక్కగా ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డి స్పందిస్తూ అధికారులతో మాట్లాడి గ్రామస్థుల సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు బొక్క వంశీధర్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, మల్లెల మైసయ్య, దర్శన్, యాదగిరి, కౌన్సిలర్లు బాల్‌రాజ్, శివలింగంగౌడ్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● ముగ్గురి అరెస్ట్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకులు, ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం, పంటరిపురం గ్రామానికి చెందిన నోసిని సుజాత(35) కొంతకాలంగా నగరంలోని మీర్‌పేట్‌లోని ఉద్యోగ్‌నగర్‌కాలనీ ఎస్‌ఎం కాంప్లెక్స్‌లో నివాసం ఉంటుంది. కాగా సుజాత కొంత కాలంగా తన ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో సుజాత ఇంటిపై శుక్రవారం సాయంత్రం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలును, జిల్లెలగూడ వివేకానగర్ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణను(40), తుక్కుగూడకు చెందిన ప్రమోద్(28)లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ తరలించారు. వారి వద్ద ఉన్న 17,080ల నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.


పెద్దచెరువును పరిశీలిస్తున్న జెడ్సీ ముకుంద్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి, డీసీ

మన్సూరాబాద్ పెద్దచెరువును సందర్శించిన జెడ్సీ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ పెద్దచెరువును జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. చెరువుకు సంబంధించి హద్దులు మారకుండా తగిన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్‌లో ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీరు చెరువులో కలవకుండా చూడాలని, చెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. వాకర్స్‌కు ఉదయం వేళ లైటింగ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు.

లాస్య నందిత మృతి బాధాకరం : తీగల


లాస్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే లాస్య నందిత మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం లాస్య నందిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. తండ్రి సాయన్నను కోల్పోయిన సంవత్సరానికే లాస్య నందిత మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మూడు దశాబ్దాలుగా సాయన్న కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధం ఉండేదన్నారు. నందిత ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్నివ్వాలని ఆయన ప్రార్థించారు. తీగలతో పాటు తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఉన్నారు.

మేయర్, కేఎల్లార్ సంతాపం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం దురదృష్టకర సంఘటన అని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఎంతో రాజకీయ భవిష్యత్ ఉన్న లాస్య హఠాన్మరణం తీవ్రంగా కలచి వేసిందని, ఆమె మరణం తీరని లోటని వారు విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యూ ట్యూబర్‌పై యువకుల దాడి

● నలుగురి అరెస్ట్


గాయపడిన శంకర్

కొత్తపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పీఎస్ పరిధి సిరీస్ రోడ్డులో ఓ యూట్యూబర్‌పై నలుగురు యువకులు గురువారం రాత్రి దాడి చేయగా వారిని పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎస్ఐ దయాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. చలమల శంకర్(33) న్యూస్ లైన్ తెలుగు యూట్యూబ్ చానెల్, తెలంగాణం పత్రికను నిర్వహిస్తున్నారు. ఆయన గురువారం రాత్రి సిరీస్ దారిలోని కార్యాలయం నుంచి మిత్రులతో కలిసి కారులో బయలుదేరారు. పెట్రోల్ బంకు వైపు కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఓ వ్యక్తి కారు ఎదురుగా రోడ్డు దాటుతుండడంతో కారు స్లో చేశారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న స్కూటీ కారును ఢీకొట్టింది. కారు నిలిపి, స్కూటీపై ఉన్న ఇద్దరు యువతులతో శంకర్ మాట్లాడే ప్రయత్నం చేయగా వారిద్దరూ అసభ్య పదజాలంతో ఆయనను, ఆయన మిత్రులనూ యువతులు వాగ్వాదానికి దిగి దూషించారు. ఈ లోగా బండ మహేష్, మైసలు ప్రవీణ్, శ్రీదుర్గ, హేమలతలు శంకర్‌ను తోసుకుంటూ కిందపడేసి కాళ్లతో, చేతులతో దాడిచేసి వెళ్లిపోయారు. నర్సింహ ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం సాయంత్రం వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

సిరీస్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలి : ఏఐఎఫ్‌బీఐ

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్‌లోని సిరీస్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలని కోరుతూ ఏఐఎఫ్‌బీఐ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాములుయాదవ్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. 1987లో సిరీస్ కంపెనీ సర్వే నంబర్ 49/13లోని 14.31 ఎకరాల భూమిలో ఫార్మా కంపెనీని స్థాపించి మందుల తయారీని ప్రారంభించిందన్నారు. మందుల తయారీతో కాలుష్యం వెలువడి ఆ ప్రాంతమంతా కలుషితమైందన్నారు. కంపెనీ పరిసరాలలో మేత కోసం వెళ్లిన పశువులు, మేకలు, గొర్లు మృత్యువాత పడ్డాయన్నారు. దీంతో 2005లో సిరీస్ ఫార్మా కంపెనీని ఇక్కడి నుంచి తరలించిందన్నారు. ఇప్పటికీ పరిసరాలలో బోర్లు వేసినా కలుషిత నీరు వస్తున్నదన్నారు. కాగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలను, మట్టిని పరీక్షించకుండానే నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై విచారణ చేపట్టాలని ఆయన కోరారు. అప్పటి అధికారులు, పార్టీ పెద్దల అండదండలతో వాసవీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దర్జాగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నదని ఆయన ఆరోపించారు. సిరీస్ ఫార్మా కంపెనీకి ఆనాటి ప్రభుత్వం కేటాయించిన సర్కార్ భూములను స్వాధీనం చేసుకుని ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న మురళీధర్‌రావు, పక్కన ఈటల, వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి

అర్బన్ నక్సల్స్, విచ్ఛిన్నకర శక్తులతో జోడోయాత్ర

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నక్సల్స్, సంఘ విద్రోహశక్తులు, ఉత్తరం, దక్షిణం పేరిట దేశాన్ని విచ్ఛిన్నకరం చేయాలనే శక్తులు మాత్రమే కాంగ్రెస్ చేపట్టే భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్నారని, అది జోడో యాత్ర కాదని తోడో యాత్ర అంటూ బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు పేర్కొన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రలో శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లో ప్రారంభమై రాత్రి నాగోల్ చౌరస్తాలో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ సభకు మురళీధర్‌రావుతో పాటు, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, పార్టీ నేతలు చాడ సురేష్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్ హాజరయ్యారు.

బీజేపీ విజయ సంకల్పయాత్రకు నేతల స్వాగతం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీవోగా కిష్టయ్య

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఈస్ట్ జోన్ ఆర్టీవోగా ఎల్.కిష్టయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల డీటీవోగా విధులు నిర్వహించిన కిష్టయ్య మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీవోగా బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇక్కడ ఆర్టీవోగా పనిచేసిన వి.సుభాష్‌చందర్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఆర్టీవోగా బదిలీ అయ్యారు. మధ్యవర్తులకు తావులేకుండా ఆర్టీఏ కార్యాలయానికి వచ్చి హెల్ప్ డెస్క్ ద్వారా సలహాలు, సూచనలు పొందాలని ఆర్టీవో విజ్ఞప్తి చేశారు.

గాడ్గే బాబా జయంతి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరె బ్రహ్మయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రధాన సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను శుక్రవారం నాగోల్‌లోని సాయినగర్ కాలనీలో నిర్వహించారు. బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, లింగరాజు, వెంకటేశ్‌గౌడ్, చైతన్య, రేణుక పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దారుషిఫాలోని ప్రభుత్వ అంధ బాలుర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఇక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకటరెడ్డితో కలిసి అధ్యక్షురాలు మేఘన నందూరి అంధ విద్యార్థులకు ఐడీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ అంధ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సద్గుణ, సామాజిక కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంధుల సమస్యలను పరిష్కరించండి : డ్వాబ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన పీఆర్‌సీ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను శుక్రవారం తెలంగాణ అంధుల సంఘాల సమాఖ్య(డ్వాబ్) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డ్వాబ్ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, మధుసూదన్‌రావు మాట్లాడుతూ తమకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అంధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌సీ తెలిపారు.

ఆ ప్రొఫెసర్‌పై విచారణకు కమిటీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పీజీ విద్యార్థినులతో అనుచితంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌పై విచారణకు ఆదేశిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులుగా ఉన్న ప్రొఫెసర్లు కృష్ణమోహనరావు, సుప్రీతి, రజిని, మంజులవాణి పాల్గొన్నారు. ప్రొఫెసర్‌పై ఆరోపణలు చేసిన విద్యార్థుల్లో కొందరిని పిలిపించిన కమిటీ సభ్యులు వారు ఇచ్చిన ఆధారాలను పరిశీలించినట్లు తెలిసింది. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ వ్యక్తిగత సెలవులో ఉన్నందున, సోమవారం తర్వాత మరోమారు సమావేశం కావాలని సభ్యులు నిర్ణయించారు.

మనూ పీహెచ్‌డీ ప్రవేశాల గడువు పెంపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలోని పీహెచ్‌డీ పార్ట్‌టైం కోర్సుల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మార్చి 8 వరకు పొడిగించినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, జర్నలిజం కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు గడువు ఫిబ్రవరి 25న ముగుస్తున్న తరుణంలో పలు విజ్ఞప్తుల అనంతరం గడువును పెంచామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ లేదా 62077 28673లో సంప్రదించాలని ఆమె సూచించారు.

నిలోఫర్‌లో నర్సులకు ఓరియంటేషన్ శిక్షణ

హైదరాబాద్ సిటీ : నిలోఫర్ ఆస్పత్రిలో కొత్తగా విధుల్లో చేరిన నర్సులకు ఓరియంటేషన్ శిక్షణను శుక్రవారం నిర్వహించారు. దాదాపు 192మంది నర్సులు కొత్తగా ఆస్పత్రిలో చేరినట్లు సూపరింటెండెంట్ ఉషారాణి తెలిపారు. రోగులకు అందించాల్సిన సేవలు, చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, పీడియాట్రిక్ నర్సింగ్ కేర్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్‌ఎంఓ డాక్టర్ జ్యోతి, నర్సింగ్ అధికారి స్వరూప, విజయలక్ష్మి పాల్గొన్నారు.